సాక్షి
ఖమ్మం
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



సాయం.. ఇంకెంత దూరం?
వరదలతో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వ సాయం అందలేదని పలువురు కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 8లో



హైవేల వెంట 3వేల మొక్కలు
జాతీయ రహదారుల వెంట ఒకేరోజు 3వేల మొక్కలు నాటినట్లు నేషనల్ హైవేస్ ప్రాజెక్టు డైరెక్టర్ దివ్య వెల్లడించారు. 10లో

గరిష్టం/కనిష్టం
35°/ 21°
వాతావరణం
జిల్లాలో బుధవారం గరిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

తక్షణమే బియ్యం అప్పగించండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను తక్షణమే అప్పగించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గడువు ముగిసినందున బకాయి ఉన్న బియ్యం అప్పగించాలని స్పష్టం చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సౌకర్యాల కల్పన

ముదిగొండ: జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలోని కేజీబీవీని మంగళవారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశాక మాట్లాడారు. విద్యార్థినులకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా తనిఖీ చేపడుతున్నామని తెలిపారు. ఆతర్వాత మెనూ అమలు, వంట సామగ్రి నాణ్యతపై ఆరా తీశారు. కేజీబీవీ ఎస్ఓ ఇందిర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలుగా చెరువుల అభివృద్ధి



మధిర చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

మధిర: మధిర నియోజకవర్గం పరిధిలోని పలు చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్ తెలిపారు. పర్యాటక శాఖ, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి మధిర చెరువును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సీఈ మాట్లాడుతూ మధిర చెరువు కట్టపై ట్యాంక్‌బండ్ నిర్మాణానికి ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈమేరకు పనులను వేగవంతంగా చేయనున్నట్లు చెప్పారు. అలాగే, మధిర, ముత్తారం, మామునూరు, మాటూరు, ఎర్రుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం, చింతకాని, చిరుమర్రి, కలకోట, బయ్యారం చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈఈ రామకృష్ణ, డీఈ నాగబ్రహ్మం, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, టూరిజం శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి, ఎస్ఈ సరిత, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తితో పాటు వివిధ శాఖల అధికారులు స్మిత, రాంబాబు, తానేశ్వర్, శంకర్‌రావు పాల్గొన్నారు.

కాస్త తగ్గిన కూరగాయల ధరలు

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదల నేపథ్యాన స్థానికంగా తోటలు దెబ్బతిని, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి నిలిచిపోవడంతో కూరగాయలు ధరలు పెరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యాన సోమవారం 'సాక్షి'లో 'కొనలేం.. తినలేం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు ధరల నియంత్రణపై దృష్టి సారించారు. హోల్‌సేల్ మార్కెట్, రైతు బజార్ల నిర్వహణదారులతో ధరల విషయమై చర్చించడమే కాక రైతు బజార్లలో బోర్డులపై రాసిన ధరకే అమ్మాలని సూచించారు. ఈమేరకు మంగళవారం పలు రకాల కూరగాయల ధరలు తగ్గాయి. రూ.66 నుంచి రూ.70 పలికిన కేజీ బెండకాయ ధర రూ.30కు, రూ.66 పలికిన కాకరకాయ రూ.50కు, రూ.150గా ఉన్న బోడ కాకరకాయలను రూ.140కు, రూ.60గా ఉన్న బీరకాయలను రూ.50 అమ్మారు. ఇవేకాక చిక్కుడుకాయ, గోరుచిక్కుడు, చామగడ్డ, క్యారెట్, క్యాప్సికం ధరలు కూడా తగ్గడంతో ప్రజలకు ఊరట లభించినట్లయింది.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి ప్రత్యేక అభిషేకం గావించారు.

యావత్ సమాజం ఉద్యమంతోనే స్వేచ్ఛ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందేందుకు ఆనాడు యావత్ సమాజం ఉద్యమించింది. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం దేశంలో భాగమైంది. అందుకే మా ప్రభుత్వం ఈరోజు ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది.' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించాక డిప్యూటీ సీఎం మాట్లాడారు. చివరి వరుసలోని పేదకు కూడా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా పాలన సాగుతోందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి గ్యారంటీలు అందించే దిశగా దరఖాస్తుల స్వీకరణకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈమేరకు డిప్యూటీ సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే..

అందుకే సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం

- ప్రతీ పేదకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా పాలన
- హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
- సమన్వయంతో మున్నేటి వరద ముంపు నుంచి రక్షణ
- ప్రజాపాలన దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



జెండావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క. పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

జిల్లాలో సమరయోధులెందరో...

స్వాతంత్య్రం కోసం జిల్లాకు చెందిన ఎందరో ఉద్యమించగా, పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండింటి అమలును బాధ్యతలు చేపట్టిన 48 గంటల్లోనే ప్రారంభించాం. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 87.12 కోట్ల మంది వినియోగించుకున్నారు. జిల్లాలో దాదాపు 1,79,97,210పైగా జీరో టికెట్లు జారీ అయ్యాయి. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు రూ.8,432.83 లక్షలు ఆదా అయింది. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్లను జిల్లాలో ఇప్పటి వరకు 3,94,753 మందికి అందజేశాం. సంబంధిత లబ్ధిదారుల ఖాతాల్లో సబ్సిడీ కింద రూ.1,119.71 లక్షలు జమ అయ్యాయి.

'సీతారామ' ద్వారా 47,381 ఎకరాల కొత్త ఆయకట్టు

సీతారామ ఎత్తిపోతల పథకం కింద పాలేరు లింక్ కాల్వ ద్వారా 47,381 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. పాలేరు రిజర్వాయర్ దిగువన సాగర్ ఎడమ కాల్వ, వైరా ప్రాజెక్టు, లంకాసాగర్ ప్రాజెక్టు, చిన్న నీటి వనరులతో నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు సీతారామ కాల్వల ద్వారా నీరు అందించడం వీలవుతుంది. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల తరలింపునకు ఏన్కూరు వద్ద రూ.77.05 కోట్ల వ్యయంతో 8.69 కి.మీ. మేర రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణం చేపడుతున్నాం. తద్వారా 7,115 ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు 1,11,818 ఎకరాల సాగర్ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా పంపుహౌస్‌లు, ప్రధాన కాల్వల నిర్మాణాన్ని పూర్తిచేశాం.

1,15,180 మందికి రుణమాఫీ

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల మేర రుణాలు మాఫీ చేశాం. జిల్లాలో 1,15,180 రైతులకు రూ.766,66,37,389 మాఫీ అయ్యాయి. ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతాం. అర్హులైన రైతులకు రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15వేల చొప్పున అందించేందుకు త్వరలో విధివిధానాలు వెల్లడిస్తాం. రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు గాను క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే పంటల బీమా పథకాన్ని అమలు చేస్తూరైతుల తరఫున ప్రీమియాన్ని మేమే చెల్లిస్తాం.

గృహజ్యోతితో తగ్గిన బిల్లుల భారం

అల్పాదాయ వర్గాల వారికి విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కలిగించేలా గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నాం. 200 యూనిట్ల కన్నా తక్కువ వాడే ప్రతీ ఇంటికి ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు 2,57,995 మంది వినియోగదారులకు నెలకు రూ.9.48 కోట్ల చొప్పున ఆగస్టు వరకు రూ.49.97 కోట్లు సబ్సిడీ ఇచ్చాం. ప్రస్తుతం పునరుత్పాదక విద్యుదుత్పత్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రంలో 40 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి నమోదు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. తొలుత కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతుల వ్యవసాయ మోటార్లకు ప్రభుత్వ ఖర్చుతో సోలార్ పంపుసెట్లు ఏర్పాటుచేస్తాం.

యంత్రాంగం సేవలు భేష్

దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షాలతో మున్నేరు 40 అడుగులకు పైగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో పరీవాహక ప్రాంతాల ప్రజల ప్రాణాలను కాపాడుతూ.. సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంలో అన్ని శాఖల ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేశారు. తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులను రికార్డు సమయంలో పునరుద్ధరించగలిగాం. ఇళ్లు దెబ్బతిన్న 15,096 కుటుంబాలకు రూ.16,500 చొప్పున సహాయం అందించాం. పంటలు దెబ్బతిన్న ప్రతీ ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందించనున్నాం. సహాయ, పునరావాస కార్యక్రమాలను వెంటనే చేపట్టి అతితక్కువ కాలంలో సాధారణ స్థితికి తీసుకొచ్చిన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులకు అభినందనలు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, డి.మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్‌శ్రేష్ఠ, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం

- మంగళవారం ఉదయం వరకు కొనసాగిన శోభాయాత్రలు
- వెయ్యికి పైగా ప్రతిమలు నిమజ్జనం చేసినట్లు అంచనా



మంగళవారం తెల్లవారుజామున మున్నేటిలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలో వినాయక ప్రతిమల నిమజ్జనం మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతాన ముగిసింది. ఖమ్మంలోని కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్, ఖమ్మం రూరల్ మండలం పరిధి నాయుడుపేట, తీర్థాలతో పాటు మున్నేటి పరీవాహక ప్రాంతాల్లో మరికొన్ని చోట్ల కూడా నిమజ్జనం నిర్వహించారు. సోమవారం సాయంత్రం 4గంటలకు మొదలైన నిమజ్జన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. దాదాపు వెయ్యికి పైగా విగ్రహాలను మున్నేటిలో నిమజ్జనం చేసినట్లు అంచనా. జిల్లా కేంద్రంతో పాటు ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లోని పలు గ్రామాల నుంచే కాక చింతకాని, ముదిగొండ, కొణిజర్ల, బోనకల్ మండలాల నుంచి సైతం భక్తులు విగ్రహాలను ఇక్కడకు తీసుకొచ్చారు. దీంతో కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌లోని ఘాట్లతో పాటు నాయుడుపేట మున్నేరు జంక్షన్‌లో నిమజ్జనం కొనసాగింది.

పకడ్బందీ చర్యలతో విజయవంతం

ప్రభుత్వ శాఖల నేతృత్వాన చేపట్టిన పకడ్బందీ చర్యలతో వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య నేతృత్వాన వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించగా నవరాత్రోత్సవాలతో పాటు శోభాయాత్ర, నిమజ్జనం విజయవంతమయ్యాయి. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, మత్స్య, ఇరిగేషన్ తదితర శాఖల ఉద్యోగులు సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించారని పలువురు కొనియాడారు. కాగా, ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన అందరికీ స్తంభాద్రి ఉత్సవ కమిటీ తరఫున అధ్యక్షుడు వినోద్ లాహోటి ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

సర్టిఫికెట్లు ఇప్పించండి సార్..

- వరదల్లో కోల్పోయిన సర్టిఫికెట్ల కోసం 1,907 దరఖాస్తులు
- ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 856..
- మండలాల్లో పూర్తయిన సర్వే, కేఎంసీలో కేంద్రాల మూసివేత
- ఇంకా ఎవరైనా ఉంటే నేరుగా స్వీకరిస్తామన్న అధికారులు



సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న ముంపు ప్రాంతాల ప్రజలు (ఫైల్)

కేఎంసీ పరిధిలో అందిన దరఖాస్తులు

రెవెన్యూ	285
విద్యావిభాగం	354
బ్యాంకు	54
ఇతరాలు	156
మొత్తం	849

మండలాల వారీగా సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులు

మండలం	ముంపునకు గురైన ఇళ్లు	వచ్చిన దరఖాస్తులు
ఖమ్మం రూరల్	2,813	856
తిరుమలాయపాలెం	193	135
వైరా	429	27
కూసుమంచి	417	16
చింతకాని	122	15
నేలకొండపల్లి	197	06
కల్లూరు	18	01
ముదిగొండ	222	01
తల్లాడ	73	01

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో గతనెల 31, ఈనెల 1న కనీవిని ఎరుగని రీతిలో వచ్చిన వరదలతో పలువురుతమ ధ్రువీకరణ పత్రాలను కోల్పోయారు. కొందరి సర్టిఫికెట్లు కొట్టుకుపోగా, మరికొందరివి పూర్తిగా తడిసి దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు కొత్త సర్టిఫికెట్ల జారీ కోసం దరఖాస్తులు స్వీకరించారు. వరదల్లో విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు రైతుల భూమి పత్రాలు, పట్టేదారు పాస్‌పుస్తకాలు, ఇతర అనేక విలువైన ధ్రువీకరణ పత్రాలను కోల్పోవడంతో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ఖమ్మం కార్పొరేషన్‌లో 14కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించగా.. ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈనెల 11 నుంచి ఇంటింటి సర్వే చేపట్టారు. ఖమ్మం రూరల్, మధిర మండలాల్లో నాలుగు రోజుల పాటు సర్వే కొనసాగింది. అయితే, సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ రాకపోవడంతో మంగళవారం కేఎంసీలోని 14కేంద్రాలను తొలగించారు. ఒకవేళ ఎవరైనా వస్తే నేరుగా కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని అధికారులు సూచించారు.

1,907 దరఖాస్తులు

భారీ వర్షాలు, వరదలతో ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో ఇళ్లు నీట మునిగాయి. వరదలతో పలువురు కోల్పోయిన సర్టిఫికెట్లలో ఎక్కువగా విద్యార్హతకు సంబంధించివే ఉన్నాయి. ఖమ్మంరూరల్ మండలంలో 2,813 ఇళ్లకు వెళ్లి అధికారులు సర్వే చేయగా 856 మంది సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదేమండలంలో 110ఇళ్లకు తాళాలు వేసినట్లు గుర్తించారు. ఇక ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9,220 ఇళ్లకు పైగా వరద ముంపునకు గురి కాగా.. బాధితుల కోసం ఏర్పాటుచేసిన కేంద్రాల ద్వారా 849 దరఖాస్తులు అందాయి. అలాగే, తిరుమలాయపాలెం మండలంలో నిర్వహించిన సర్వేలో 135 మంది సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

స్టడీ సర్టిఫికెట్ల కోసమే ఎక్కువ..

వరదలతో సర్టిఫికెట్లు కోల్పోయినట్లు జిల్లా వ్యాప్తంగా 1,907 దరఖాస్తులు అందగా, ఇందులో అత్యధికంగా విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లే ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ఆపై సర్టిఫికెట్ల కోసం ఎన్ని దరఖాస్తులు అందాయో విభజించి ఆయా శాఖలకు మీ సేవా ద్వారా అధికార యంత్రాంగమే దరఖాస్తులు చేస్తుంది. ఆపై సర్టిఫికెట్లు జారీ అయ్యాక లామినేషన్ చేయించి అన్నీ కలిపి ప్రత్యేక కవర్‌లో అందిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఇప్పటికే ప్రకటించారు. కాగా, ఉద్యోగులు మండలాల్లో సర్వే చేపట్టిన సమయాన అందుబాటులో లేని వారి దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయాల్లో, కేఎంసీ పరిధిలోని ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరణకు కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటుచేస్తామని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి సింగరేణి మెడికల్ బోర్డ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈనెల 19, 20 తేదీల్లో కార్పొరేట్ స్థాయి మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. సంస్థలో విధులు నిర్వర్తిస్తూ రెండేళ్ల సర్వీస్ ఉన్న వారి స్థానంలో వారసులకు ఉద్యోగావకాశం కల్పించేందుకు యాజమాన్యం ఈ మెడికల్ బోర్డ్ నిర్వహిస్తోంది. మొదటి రోజు గురువారం కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి పనిచేయడానికి శరీరం సహకరిస్తుందా, లేదా అని నిర్ధారిస్తారు. అనంతరం రెండో రోజైన 20వ తేదీన వైద్య నిపుణులు మరోమారు పరీక్షించి ఫలితం వెల్లడిస్తారు. కాగా, ఈ ప్రక్రియలో దళారులను నియంత్రించేందుకు నిఘా పటిష్టం చేశామని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా ఫోన్ చేసి సహకరిస్తామని చెబితే 94911 44104 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇక అన్‌ఫిట్ అయిన వారి వ్యాధుల వివరాలను నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలని కార్మికులు కోరుతుండగా యాజమాన్యం నుంచి స్పందన రాలేదు. కాగా, బోర్డ్‌కు హాజరుకానున్న అభ్యర్థుల వివరాలు ముందుగానే దళారుల చేతికి వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది.

'కానుక' కలకలం!

సింగరేణి ఉన్నతోద్యోగులపై ఓ బడా కాంట్రాక్టర్ అభిమానం

- కొందరికి బహుమానంగా గిఫ్ట్ ప్యాక్‌లు
- రూ.లక్ష విలువైన గిఫ్ట్‌లు అందక మిగతా వారి అసంతృప్తి
- ఈ వ్యవహారంపై అంతర్గతంగా కొనసాగుతున్న విచారణ?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ రంగ కార్పొరేట్ సంస్థల్లో మేటిగా కొనసాగుతున్న సింగరేణిలో రోజుకో అంశం వివాదాస్పదంగా మారుతోంది. తాజాగా 'గిఫ్ట్' ప్యాక్‌ల అంశం తెరపైకి వచ్చింది.

విజిలెన్స్ విచారణ ?

రూ.లక్ష విలువ చేసే గిఫ్ట్‌లు 100 నుంచి 120 వరకు సింగరేణిలో వివిధ హోదాల్లో పని చేసే కొందరు ఉద్యోగులకు అందాయనే ప్రచారం జోరందుకుంది. అయితే గిఫ్ట్ ప్యాక్‌ల రూపంలో మొత్తంగా రూ.1.20 కోట్ల నుంచి రూ.2 కోట్ల వరకు చేతులు మారాయనే ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. గిఫ్ట్‌లు అందజేసిన సంస్థకు అయాచితంగా లాభాలు వచ్చేలా నిబంధనల్లో మార్పులు చేశారా? అందుకు ప్రతిఫలంగా గిఫ్ట్‌లు అందాయా? గతంలో కొనసాగినట్టుగా ఇక ముందు కూడా 'సహాయ – సహకారాలు' అందివ్వాలనే 'గుడ్‌విల్'తో వీటిని ఇచ్చారా అనే గుసగుసలు హెడాఫీస్‌తో పాటు సింగరేణి పరిధిలో ఉన్న పది ఏరియాల్లోనూ వినిపిస్తున్నాయి. రోజులు గడిచేకొద్దీ ఈ వ్యవహారం చినికి చినికి గాలివానగా మారుతుండడంతో విజిలెన్స్ విభాగంతో అంతర్గతంగా విచారణ చేయిస్తున్నట్టు తెలుస్తోంది. విచారణకు సంబంధించిన వివరాల కోసం సంబంధిత అధికారిని ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సంస్థ ప్రతిష్ట మసకబారేలా..

తెలంగాణ విద్యుత్ సంస్థల నుంచి రమారమీ రూ.30 వేల కోట్ల బకాయిలు సింగరేణికి రావాల్సి ఉంది. ఈ స్థాయి బకాయిలు ఉంటే ప్రభుత్వ రంగ కార్పొరేట్ సంస్థలు దివాళా అంచుకు చేరుతాయి. కానీ సింగరేణి ఇందుకు భిన్నంగా నిలిచింది. కొండలా బకాయిలు పెరిగిపోతున్నప్పటికీ పక్కా ప్రణాళిక, దానికి తగ్గ నిర్వహణ చాతుర్యం, ఆర్థిక క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన కార్మికులు, ఉద్యోగుల పనితీరు కారణంగా సంస్థ మనుగడ సాఫీగా సాగిపోతోంది. 'కాగ్' లాంటి చట్టబద్ధ సంస్థల రిపోర్టుల్లోనూ సింగరేణికి ప్రశంసలు దక్కాయి. కానీ ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు సింగరేణి ప్రతిష్టను మసకబారుస్తున్నాయి. కారుణ్య నియామకాల్లో ఒక్కో ఫైల్‌కు రూ.6 నుంచి రూ.7 లక్షలు చేతులు మారుతున్నాయనే ఆరోపణలపై ఏసీబీ, సీఐడీ విభాగాలు తమ వంతు విచారణ చేపట్టాయి. ఈ అంశం ఓ కొలిక్కి రాకముందే గిఫ్ట్ ప్యాక్‌ల అంశం తెరపైకి వచ్చింది.

వెలుగులోకి ఇలా..

ఇంటర్నెట్ వినియోగం పెరిగిన తర్వాత వీడియో కాన్ఫరెన్స్‌లు, వాట్సాప్ గ్రూపుల్లో కార్యనిర్వహణ, ఈ మెయిల్స్‌లో ఉత్తర ప్రత్యుత్తరాలు వంటి పనులు పెరిగాయి. దీంతో ఆరు నెలల క్రితం మిడిల్ మేనేజ్‌మెంట్ నుంచి టాప్ మోస్ట్ అధికారుల వరకు సింగరేణి సంస్థ కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు సమకూర్చింది. మలి దశలో తమకు కూడా కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు వస్తాయనే నమ్మకంతో ఇతర ఉద్యోగులు ఉన్నారు. అయితే తమకు కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు రాకుండా గతంలో ల్యాప్‌ట్యాప్/డెస్కటాప్‌లు అందుకున్న వారి చేతికే మళ్లీ కొత్తవి అందడంతో అనుమానాలు మొదలయ్యాయి. పైగా సదరు సంస్థ.. గిఫ్ట్‌లు అందుకున్న అధికారులను రిసీవ్ అన్నట్టుగా సంతకాలు పెట్టమని ఒత్తిడి చేయడం అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీనిపై ఎవరికి వారుగా కూపీ లాగితే కొత్త ల్యాప్‌టాప్/డెస్కటాప్‌లు సింగరేణి సంస్థ కొనిపెట్టినవి కాదని, సింగరేణి పనులు దక్కించుకున్న ఓ బడా సంస్థ తరఫున కొందరు ఉద్యోగులకే అందిన ప్రత్యేక కానుకలనే అంశం వెలుగు చూసింది.



ఏంటీ ఈ గిఫ్ట్ ప్యాక్..

సింగరేణికి సంబంధించిన పలు పనులను కొన్ని ఏజెన్సీలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో టెండర్ల ప్రక్రియ నిర్వహించే ఓ బడా ప్రైవేట్ సంస్థ సింగరేణిలో కొందరు ఉద్యోగులపై తన అభిమానాన్ని ఘనంగా చాటుకున్నట్టు తెలుస్తోంది. తమకు మంచి లాభాలు వచ్చాయని, అందుకు ఉడతా భక్తిగా ఓ చిరు కానుక అంటూ ల్యాప్‌టాప్, డెస్కటాప్, ట్యాబ్.. మొత్తంగా రూ.లక్ష విలువైన గిఫ్ట్ ప్యాక్‌ను సిద్ధం చేయించింది. సదరు సంస్థ రూపొందించుకున్న జాబితాలో ఉన్న అధికారులకు వాటిని పంపిణీ చేసింది.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



మిథిలేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఖమ్మం కవిరాజ్ నగర్‌లోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి దారా మిథిలేష్ ప్రతిభ కనబరిచాడు. ఇటీవల భువనగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఓపెన్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఆయన అండర్–14 బాలుర కేటగిరీ నుంచి మాస్ స్టార్ట్ రింక్ విభాగం, 500 మీటర్ల విభాగం, వెయ్యి మీటర్ల విభాగాల్లో ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా మిథిలేష్‌ను నారాయణ విద్యాసంస్థల డీజీఎం వెంకటరమణారెడ్డి, ప్రిన్సిపాల్ అమలోద్భవి, కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, డీన్లు మాధవరావు, రాజ్‌కుమార్, ఏఓ కిషోర్, పీఈటీ చందు తదితరులు మంగళవారం అభినందించారు.

22, 23వ తేదీల్లో రోలర్ స్కేటింగ్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 22, 23వ తేదీల్లో జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ కె.సురేష్ తెలిపారు. ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఈనెల 20వ తేదీలోపు సంప్రదించాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను అక్టోబర్ 4నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 99123 99211 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

పామాయిల్ బోర్డును సాధిస్తాం...

ఖమ్మంమామిళ్లగూడెం: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయిల్‌పామ్ సాగు ఎక్కువగా ఉన్న నేపథ్యాన రైతులకు అండగా నిలిచేలా కృషి చేస్తున్నట్లు బీజేపీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పామాయిల్ బోర్డు సాధనకు రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, ఎంపీలతో కలిసి కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తానని వెల్లడించారు. ప్రస్తుతం పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుండి 27.5శాతానికి పెంచడంతో రైతులకు ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. కాగా, దిగుమతి సుంకం పెంపుదలకు సహకరించి రైతులకు భరోసా కల్పించడంపై కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మధిర: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మండలంలోని ఆత్కూరుకు చెందిన డాలు గోపి (30) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె ఇటీవల కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడగా చికిత్స చేయించి రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చారు. ఈ సమయంలో సుమారు రూ.10 లక్షలు ఖర్చయినట్లు తెలిసింది. ఈమేరకు ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన గోపి ఇంటి వెనక ఓవర్ హెడ్ ట్యాంక్ నిచ్చెన మెట్లకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబీకులకు ఫిర్యాదుతో మధిర టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖాతా నుంచి రూ.50 వేలు అపహరణ

నేలకొండపల్లి: సైబర్ నేరగాళ్ల చేతిలో మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు మోసపోయాడు. మండల కేంద్రానికి చెందిన ఉపేందర్‌కు స్థానిక బ్యాంక్‌లో ఖాతా ఉండగా, రూ.50,300 వరకు నగదు ఉంది. ఆయన మంగళవారం ఏటీఎంలో డబ్బు డ్రా చేసేందుకు వెళ్లగా బ్యాలెన్స్ రూ.300 మాత్రమే చూపించింది. దీంతో బాధితుడు అధికారులను సంప్రదించగా, మహారాష్ట్రకు చెందిన సైబర్ నేరగాళ్లు ఆయన ఖాతాను హ్యాక్ చేసి డబ్బు డ్రా చేసినట్లు తేలింది. అయితే, మహారాష్ట్రలోనే ఫిర్యాదు చేయాలని చెబుతుండడంతో తనకు న్యాయం చేయాలని ఉపేందర్ కోరాడు.

దాడికి ప్రతిదాడి

ఖమ్మం అర్బన్: ఖమ్మం శివారు దానవాయిగూడెంలో సోమవారం రాత్రి జరిగిన ఓ వ్యక్తికి గాయాలు కాగా.. ఆయనకు సంబంధించి వ్యక్తులు మంగళవారం ప్రతిదాడికి దిగారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా సోమవారం జరిగిన దాడిలో కృష్ణకు తీవ్ర గాయాలైన విషయం విదితమే. ఈనేపథ్యాన ఆయనకు చెందిన వ్యక్తులు కొందరు మంగళవారం రాత్రి రెండు ఇళ్లపై దాడి చేశారు. ఆ ఇళ్లలోని వ్యక్తులపై దాడి చేయడమే కాక సామగ్రిని ధ్వంసం చేశారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఖమ్మం అర్బన్ పోలీసులు చేరుకుని బందోబస్తు చేపట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని సీఐ భానుప్రకాష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

సాయం.. ఇంకెంత దూరం?

కేఎంసీకి క్యూ కడుతున్న వరద బాధితులు

- వరదల్లో ఇళ్లు మునిగినా సాయం అందలేదని ఆవేదన
- అనర్హులకు నగదు జమ అయిందని ఫిర్యాదులు?

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలు, వరదలతో సర్వం కోల్పోయిన తమకు ప్రభుత్వ సాయం ఇంకా అందలేదని, అయినా తమ గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పలువురు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి అధికారులకు విన్నవించుకుంటున్నారు. ఇళ్లు ముంపునకు గురికాని వారికి సాయం అందగా.. రెండు రోజులు వరద నీటిలో ఇళ్లు నాని సర్వస్వం కోల్పోయిన తమపై నిర్లక్ష్యం చూపడం సరికాదని వాపోతున్నారు. ఇక కొందరు బాధితుల ఇళ్లకు అధికారులు వెళ్లి సర్వే చేసినా జాబితాలో పేర్లు లేవంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద తాకిడికి గురైన ఇళ్ల యజమానుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఒక్కో కుటుంబానికి రూ.16,500 ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ నగరంలో వందలాది కుటుంబాలు నేటికీ తమకు సాయం అందలేదని కేఎంసీకి క్యూ కడుతున్నారు.

8,399 కుటుంబాలకు సాయం

వరదల ముంపునకు గురైన ఇళ్లకు వెళ్లి సిబ్బంది వెళ్లి బాధితుల వివరాలు, బ్యాంక్ ఖాతా నంబర్లు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దీంతో ఈనెల 9నుండి వారి ఖాతాల్లో రూ.16,500 చొప్పున నగదు జమ అవుతోంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు 10వేల వరకు ఇళ్లు వరద తాకిడికి గురికాగా, ఇప్పటి వరకు 8,399 కుటుంబాలకు ప్రభుత్వ సాయం జమ అయింది. మిగతా 893 కుటుంబాల బ్యాంక్ ఖాతా వివరాలు సక్రమంగా లేనందున మరోమారు సర్వే చేసి సాయం జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదేసమయాన కొందరు ఇల్లు నీట మునగకున్నా, నష్టం జరగకున్నా సాయం అందిందని పలువురు ఆరోపిస్తున్నారు.

నమోదు కాలేదట...

ముంపునకు గురైన ఇళ్ల వివరాలను సిబ్బంది సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అయితే, కొందరి వివరాలు మాత్రం నమోదు కాలేదని మంగళవారం కార్యాలయంలో పరిశీలించగా తేలింది. మోతీనగర్‌లో నివాసం ఉంటున్న వందనపు సమత ఇళ్లు వరద నీటిలో మునిగింది. వరద తగ్గాక సర్వే చేపట్టిన సిబ్బంది సమత కుటుంబ వివరాలను సేకరించారు. కానీ మంగళవారం కేఎంసీకి వచ్చి ఆరా తీస్తే వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. సర్వే చేసిన సిబ్బందిని ఆరా తీయగా.. చెక్ చేస్తామని దాటవేశారని వాపోయారు.



కేఎంసీకి క్యూ..

మూడు రోజుల వరుస సెలవుల తర్వాత మంగళవారం కేంఎసీ కార్యాలయంలో పౌర సేవలు ప్రారంభమయ్యాయి. దీంతో వరద సాయం అందని బాధితులు కార్యాలయానికి క్యూ కట్టారు. తమ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయో, లేదో చూడాలని సిబ్బందిని కోరడం కనిపించింది. అయితే, పెద్దసంఖ్యలో బాధితులు రావడంతో కేఎంసీ సిబ్బంది గదులకు తలుపులు వేసి ఒక్కొక్కరికి లోపలకు పిలిపించి వివరాలను పరిశీలించారు.

కేఎంసీలోని ఐటీ విభాగం గది వద్ద వేచి ఉన్న బాధితులు

అందరికీ వచ్చినా మాకు రాలేదు..

వరదలు నా ఇంటిని ముంచెత్తాయి. ఇంట్లో ఉన్న సామగ్రి కోల్పోయాం. మా ఇంటి పక్కన వారందరికి సాయం ఖాతాల్లో జమ అయింది. కానీ ఇప్పటివరకుమాకు రాకపోవడంతో కనుక్కుందామని కార్యాలయానికి వచ్చాను. పక్షవాతంతో బాధపడుతున్న నేను మొదటి అంతస్తుకు ఇబ్బంది పడుతూ రావాల్సి వచ్చింది. అధికారులు స్పందించి త్వరగా సాయం అందించాలి.



– చల్ల భద్రమ్మ, రామన్నపేట

ఖమ్మం వన్‌టౌన్ సీఐపై దాడి

- మద్యం మత్తులో పలువురి వీరంగం
- యథేచ్ఛగా మద్యం అమ్మకాలతో ఘర్షణ

ఖమ్మంక్రైం: వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తు విధుల్లో ఉన్న ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్‌పై సోమవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న కొందరు దాడి చేశారు. ఈఘటనలో సీఐ కుడి చేతి భుజం వద్ద గాయమైంది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం పాత బస్టాండ్ సమీపంలో సమీపాన ప్రతిష్ఠించిన విగ్రహాన్ని సమయానికి నిమజ్జనం కోసం తీసుకెళ్లాలని ఆదివారం సాయంత్రం నుంచే వన్‌టౌన్ పోలీసులు సూచిస్తున్నారు. అయినా ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాన్ని కదిలించకపోవడంతో గస్తీ తిరుగుతున్న సీఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది వెళ్లి మాట్లాడారు. అప్పటికే రాత్రి 11గంటలు దాటగా, మద్యం సేవించిన వారు సీఐ మాటలను ఖాతరు చేయలేదు. దీంతో ఆయన గట్టిగా చెప్పడంతో అక్కడ ఉన్న కొందరు సీఐ, సిబ్బందిని దుర్భాషలాడుతూ సీఐను బలవంతంగా తోసేయడంతో ఆయన చేయి జీపుకు గుద్దుకుని రక్తస్రావమైంది. అంతలోనే చేరుకున్న ఇంకొందరు సిబ్బంది దాడికి పాల్పడిన అశోక్, అరుణ్, రవీంద్ర, సాయిస్వరూప్‌తో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసారు. కాగా, నిందితులు కొందరు పండ్ల వ్యాపారం చేస్తూ ఒక పార్టీలో తిరుగుతుంటారని తెలిసింది.

మద్యం అమ్మొద్దని హెచ్చరించినా...

గణేష్ నిమజ్జనం సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా బార్లు, వైన్స్ మూసివేయాలని సీపీ ఆదేశించారు. అయితే, నిర్వాహకులు ముందుగానే భారీ మొత్తంలో మద్యాన్ని బెల్ట్ షాపులకు తరలించి సోమవారం విక్రయించినట్లు తెలిసింది. ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల పట్టింపు లేని తనంలో ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వస్తున్నాయి.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

మధిర: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి మంగళవారం మధిర రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. ఏపీలోనిఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు తూర్పుబజార్‌కు చెందిన కత్తుల శ్రీను(36) సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో వెళ్తూ మధిరలో దిగాడు. ఆతర్వాత రెండో నంబర్ ప్లాట్‌ఫారంపై మతి చెందగా ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈమేరకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు...


నేలకొండపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని అనాసాగారానికి చెందిన పి.నాగేశ్వరరావు(28) ఖమ్మంలోని ఓ షోరూమ్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకుంటున్నానని, ప్రస్తుతం సువర్ణాపురం ప్రాంతంలో ఉన్నట్లు బంధువులకు చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశాడు. దీంతో బంధువులు, కుటుంబ సభ్యులు గాలించగా మధ్యాహ్నం అపస్మారకస్థితిలో ఉన్న నాగేశ్వరరావును గుర్తించి ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, నాగేశ్వరరావు ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

పండితాపురానికి చెందిన మహిళ...

కామేపల్లి: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందగా బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు... మండలంలోని పండితాపురానికి చెందిన బండారి లక్ష్మి(36) కొద్దిరోజులుగా ఫిట్స్, కడుపు నొప్పితో బాధపడుతుంది. ఈక్రమంలోనే 12వ తేదీన భర్త ఉపేందర్‌తో కలిసి పత్తి చేనుకు పురుగు మందు కొట్టేందుకు వెళ్లగా కడుపునొప్పి తీవ్రం కావడంతో తట్టుకోలేక పురుగు మందు తాగింది. ఈ విషయాన్ని గమనించిన ఆమె భర్త ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం లక్ష్మి మృతి చెందింది. ఘటనపై ఉపేందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థుల ఆటోను ఢీ కొట్టిన కారు

- ఓ బాలుడు మృతి, మరో ఐదుగురికి గాయాలు
- ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం



మృతుడు ఈశ్వర్ (ఫైల్)

ములకలపల్లి : మద్యం మత్తులో కారు నడుపుతూ ఆటోను ఢీ కొట్టిన ఘటనలో ఓ బాలుడు మృతి చెందగా, మరో ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఉమ్మడి పూసుగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల చిన్నారులు పాల్వంచలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. వీరంతా సుబ్బనపల్లికి చెందిన అట్టికేటి ప్రవీణ్ ఆటోలో రోజూ వెళ్తుంటారు. మంగళవారం సాయంత్రం బడి నుంచి తిరిగి వస్తుండగా పాతూరు సమీపంలో వీరి ఆటోను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయి పక్కనే ఉన్న గోతిలో ఎగిరిపడింది. ఆటోలోని చిన్నారులంతా రోడ్డుపై పడిపోగా, వారి రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. సమీపంలో ఉన్నవారు విద్యార్థులను పాల్వంచ ఆస్పత్రికి తరలించారు. అయితే వీకే రామవరం గ్రామానికి చెందిన లైన్‌మెన్ ఉపేందర్ కుమారుడు రచ్చ ఈశ్వర్ (12) ఆస్పత్రికి వెళ్లకముందే మృతిచెందాడు. ఈశ్వర్ సోదరుడు యశ్వంత్‌కు స్వల్ప గాయాలు కావడంతో కొత్తగూడెం తరలించారు. ఆటో డ్రైవర్ ప్రవీణ్ సోదరుడి కుమారుడు తేజాక్షిత్, కూతురు సాత్విక, వీకే రామవరం మాజీ సర్పంచ్ కుంజా భాస్కర్ కుమారుడు మోక్షిత్‌ను ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. సుబ్బనపల్లికి చెందిన ఊట్ల శ్రీధర్ కూతురు జ్ఞానచరితకు పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కాగా, ఆటో డ్రైవర్ ప్రవీణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. మృతుడి, క్షతగాత్రుల కుటుంబీకుల రోదనలతో పాల్వంచ ఆస్పత్రి వద్ద విషాదం అలుముకుంది. పాల్వంచ ఎస్సై సుమన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయగా, సీఐ ప్రవీణ్ పరిస్థితిని సమీక్షించారు. ములకలపల్లి తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఆర్‌ఐలు భద్రు, సత్యావతి ఆస్పత్రికి వెళ్లి వివరాలు సేకరించారు. మద్యం మత్తులో తూలుతూ కారు నడుపుతున్న కంటె శేఖర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ప్రమాద స్థలం వద్ద పడిపోయిన విద్యార్థులు

ప్రభుత్వ పథకాలతో స్టాళ్లు



వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మేరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం, 200యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన డ్రోన్ల వివరాలతో స్టాళ్లు ఏర్పాట్లు చేయగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. అక్కడే కొందరికి మహాలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. అలాగే, మెప్మా, డ్వాక్రా మహిళలతో మాట్లాడి ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా

చంద్రుగొండ : కొత్తగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆ బస్సు భద్రాచలం నుంచి గుంటూరు వెళ్తుండగా సారపాక వద్ద నలుగురు వ్యక్తులు ఎక్కారు. వారు గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం అందుకున్న ఎస్‌ఐ స్వప్న బస్సును చంద్రుగొండలో ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న సంచుల్లో సుమారు 10 కేజీల గంజాయి లభించినట్లు సమాచారం. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న విచారిస్తున్నట్లు తెలిసింది.

మహిళ మెడలో గొలుసు చోరీ

సత్తుపల్లి టౌన్: ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలు వెళ్తుండగా వెనకాల కూర్చున్న మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన సత్తుపల్లి మండలం కిష్టారంవద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సత్తుపల్లి మండలం కిష్టారం 'వై' జంక్షన్ మీదుగా కొత్తగూడెంకు చెందిన దంపతులు రవి – కృష్ణవేణి బైక్ వెళ్తున్నారు. ఈక్రమంలో వెనుకాల నుంచి వచ్చి మరో వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి కృష్ణవేణి మెడలో నుంచి రూ.75వేల విలువైన బంగారు గొలుసు లాక్కెళ్లాడు. దంపతులు సత్తుపల్లి మండలం కాకర్లపల్లి వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరగగా బాధితుల ఫిర్యాదుతో సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఒకరికి బదులు మరొకరు పరీక్ష..

- పదో తరగతి విద్యార్థినికి నాలుగేళ్ల జైలు

కొత్తగూడెంటౌన్: 2016లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అసలు విద్యార్థినికి బదులు మరో బాలిక పరీక్ష రాసిన కేసులో కొత్తగూడేనికి చెందిన రాచబంటి శేషమణి అనే నాటి విద్యార్థినికి నాలుగేళ్ల జైలుశిక్ష విధిస్తూ కొత్తగూడెం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ మంగళవా రం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెంలోని ఎస్‌ఆర్‌డీజీ పాఠశాల రూమ్ నంబర్ 19లో శేషమణికి బదులు మరో మైనర్ బాలిక పరీక్ష రాస్తుండగా ఇన్విజిలేటర్ బానోతు రమేష్‌కు అనుమానం వచ్చింది. దీంతో ఆయన హాల్ టికెట్‌ను పరిశీలించగా శేషమణికి బదులు మరో అమ్మాయి పరీక్షలు రాస్తున్నట్లు గుర్తించి హాల్ టికెట్‌కు ఆన్సర్ షీట్ జత చేసి చీఫ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన విచారించగా శేషమణితో పాటు బాలిక కూడా నేరాన్ని అంగీకరించారు. దీంతో కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఐదుగురు సాక్షులను విచారించగా శేషమణిపై నేరం రుజువు కావడంతో ఒక సెక్షన్‌లో ఒక ఏడాది, మరోక సెక్షన్‌లో మూడేళ్ల.. మొత్తం నాలుగేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

దళితబంధు లబ్ధిదారులు ఆర్థికంగా ఎదగాలి

- సిరిపురంలో పైలట్ ప్రాజెక్టుగా వ్యవసాయ పంపుసెట్లకు 'సోలార్'
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

చింతకాని: దళితబంధు లబ్ధిదారులు యూనిట్లను మరొకరికి అప్పగించకుండా సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. చింతకాని మండలం నాగులవంచలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత నిధుల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మండలంలో దళితబంధు పథకానికి 3,462 కుటుంబాలను ఎంపిక చేయగా, రెండో విడతగా 847 మందికి రూ.15, 54,32,629 నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. దళితబంధు యూనిట్లను కొనడం, బెదిరించి తీసుకెళ్లటం నేరమని స్పష్టం చేశారు. అలా ఎవరి యూనిట్లు అయినా ఇతరులకు అప్పగిస్తే లబ్ధిదారులకు తిరిగి అప్పగించాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారులు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఈ ఏడాది నుంచే భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు అందిస్తామని తెలిపారు.

సోలార్ విద్యుదుత్పత్తి

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వడంతో పాటు కొన్ని గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి సోలార్ ప్లాంట్లు అమర్చనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇందుకోసం మధిర నియోజకవర్గంలోని సిరిపురంను ఎంపిక చేశామని.. తొలిదశలో గ్రామంలోని రైతులందరికీ ప్రభుత్వ ఖర్చుతో సోలార్ వ్యవసాయ పంపుసెట్లు ఇస్తామని చెప్పారు. ఈ యూనిట్లతో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను రైతు వినియోగించుకోగా మిగిలితే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కాగా, సేంద్రియ వ్యవసాయ సాగును ప్రోత్సహించేందుకు చింతకాని మండలానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ గణేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, డీపీఓ ఆశాలత, ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ, తహసీల్దార్ అనంతరాజు, ఎంపీడీఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

దేశభక్తుల త్యాగాన్ని విస్మరిస్తున్నారు...

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం/ఎర్రుపాలెం: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశభక్తుల త్యాగాలను విస్మరించే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆరోపించారు. పార్టీ ఆధ్వర్యాన మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించగా జిల్లా కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోందని ఆరోపించారు. పార్టీ నాయకులు శ్యాంరాథోడ్, సరస్వతి, చంద్రశేఖర్, అల్లిక అంజయ్య, కోటేశ్వరావు, వెంకటనారాయణ యాదవ్, ఉపేందర్‌గౌడ్, రవిరాథోడ్, మృత్యుంజయ, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇక ఎర్రుపాలెంలో జరిగిన వేడుకల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను అవమానపరిచే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవం పేరిట నిర్వహించడం సరికాదన్నారు. నిజాం కబంధహస్తాల్లో మగ్గిన తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17 ముమ్మాటికి విమోచ దినోత్సవమేనని తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షుడు నూతక్కి నరసింహారావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, నాయకులు చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరావు, దేవరకొండ కోటేశ్వరరావు, పాపట్ల రమేష్, పింగళి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఖమ్మంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

బీఆర్‌ఎస్ పాలన నుండి విముక్తి చేశాం...

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణను బీఆర్‌ఎస్ పాలన నుండి విముక్తి చేసి ప్రజాపాలనను తీసుకోచ్చామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించగా ఆయన జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. తమ పార్టీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజాపాలన సాగిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు దొబ్బల సౌజన్య, మలీదు వెంకటేశ్వర్లు, కొత్తా సీతారాములు, బొడ్డు బొందయ్య, ఏలూరి రవికుమార్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొమ్మిడి శ్రీనివాసయాదవ్, బాణాల లక్ష్మణ్, ప్రతిభారెడ్డి, దివ్య తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

మట్టి మనుషుల మహోన్నత పోరాటం

ఖమ్మంమయూరిసెంటర్: మట్టి మనుషుల మహోన్నత పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సాయుధపోరాట వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం హేమంతరావు మాట్లాడుతూ నిజాం పాలనలో అరాచకం రాజ్యమేలగా, సాయుధ పోరాటం చేయాల్సి వచ్చిందని తెలిపారు. కాగా, స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటంలో కనీస పాత్రలేని బీజేపీ చరిత్రను వక్రీకరించడం గర్హనీమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి వెంకటేశ్వర్లు, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కే.జానీ మియా, ఏపూరి అతాదేవి, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

పద్మశ్రీ అవార్డు గ్రహీత సచ్చిదానందశాస్త్రి కన్నుమూత



నగరంపాలెం: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానందశాస్త్రి (90) కన్నుమూశారు. వృద్ధాప్యంతో బాధపడుతోన్న ఆయన సోమవారం రాత్రి గుంటూరు అమరావతిరోడ్‌లోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారులు శివశాస్త్రి, శ్రీరామచంద్రమూర్తి, కృష్ణ మోహన్, కుమార్తె దుర్గవెంకటసుబ్బలక్ష్మీ ఉన్నారు. ఆయన భార్య గతంలోనే చనిపోయారు. సోమవారం సాయంత్రం అంత్యక్రియలను గుంటూరు బొంగరాల బీడు శశ్మానవాటికలో నిర్వహించినట్లు పెద్ద కుమారుడు శివశాస్త్రి తెలిపారు. సచ్చిదానందశాస్త్రి గతేడాది జనవరిలో పద్మశ్రీ అవార్డు, 2022లో సంగీతనాటక అకాడమి అవార్డు, 2023 నవంబర్‌లో వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, 2015లో హంసా పురస్కారం, 2009లో కొప్పరపు కవుల పురస్కారాలను అందకున్నారు. గతంలో పలువురు ముఖ్యమంత్రుల నుంచి అవార్డులను స్వీకరించారు.

ఆయన కథాగానం.. జనరంజకం..

చిన్న పిట్టకథలు, చతురోక్తులతో 'కోట'కథాగానం జనరంజకంగా సాగేది.. మధూకరం చేసుకుంటూ వేదవిద్యను నేర్చుకుని, హరికథను సాధన చేసి, ప్రఖ్యాత హరికథకుడిగా 'కోట'ఎదిగారు. హరికథకు తొలిసారిగా పద్మశ్రీ అందించిన తొలి భాగవతార్‌గా కీర్తిని పొందారు. రామాయణ, భారత, భాగవతాలను గానం చేస్తూ విశేష ప్రాచుర్యం కల్పించారు. 7 దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. 8 పదుల వయసులోనూ కథాగానం చేస్తూ వచ్చారు. సచ్చిదానంద శాస్త్రి స్వస్థలం ప్రకాశం జిల్లా అద్దంకి. 57 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. ఆసక్తి కలిగిన శిష్యులకు శిక్షణనిస్తూ వచ్చారు. చతురోక్తులు, సరస సంభాషణలతో ప్రేక్షకుల మనసు తనపై లగ్నమయ్యేవరకు కాలక్షేపం చేసి, కథాంశంతో హరికథను ఆరంభించేవారు. భక్తిరస సినిమా పాటలు, సున్నితమైన హాస్య సంభాషణలను చొప్పించటం, నృత్యాలు, అభినయం, నాటకీయతను చేర్చి హరికథను జనరంజకం చేశారు. ఈ ప్రత్యేకతతో వారికి ఎంతో డిమాండ్ ఏర్పడింది. ఒక్కరోజు విరామం లేకుండా హరికథలు చెప్పేవారు. బొత్తిగా చదువులేని వారికీ విద్య నేర్పారు. ఎలాంటి ప్రతిఫలం తీసుకోలేదు. వారంతా హరికథను వృత్తిగా స్థిరపడినవారే.



చూడ్డానికి ఏవో గ్రహాంతర జీవుల్లా కనిపిస్తున్నాయి కదూ.. కానీ ఇవన్నీ ఈ గ్రహంలోని జీవులే. మనకు బాగా తెలిసినవే. ఇవి చేపలు. గుడ్డు నుంచి బయటకువచ్చాక.. చేప పిల్లలు యోక్ సాక్(పచ్చసొన)కు అతుక్కుని ఉన్న దశలో తీసిన చిత్రమిది. ఈ ఫొటో ఓషన్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీల్లో ఓషన్ పోర్ట్‌ఫోలియో విభాగంలో విజేతగా నిలిచింది. ఈ చిత్రాన్ని కెనడాకు చెందిన షేన్ గ్రాస్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. గుడ్డు నుంచి బయటకువచ్చాక పిల్లలు తొలి దశలో ఈ పచ్చసొననే కరిగించుకుని ఆహారంగా తీసుకుంటాయట.

డిటోనేటర్లతో చెరువు మత్తడి పేల్చివేత

సగానికి పైగా నీరు వృథా



చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని శనగకుంట చెరువు మత్తడిని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు డిటోనేటర్లతో పేల్చివేశారు. దీంతో మత్తడి పూర్తిగా ధ్వంసమై చెరువులోని సగానికి పైగా నీరంతా వృథాగా పోయింది. ఈ సంఘటన చెన్నూర్‌లో సంచలనం సృష్టించింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న మత్తడి పేల్చివేత శబ్దం సమీప ప్రాంత ప్రజలకు వినిపించింది. గణేశ్ నిమజ్జనం ఉండటంతో బాణసంచా పేల్చి ఉంటారని భావించారు. రాష్ట్రంలో ఓ వైపు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హైడ్రాను తీసుకొచ్చి ఆక్రమణలను తొలగిస్తోంది. మరోవైపు ఆయకట్టుకు నీరందించే చెరువు మత్తడిని డిటోనేటర్లతో పేల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. సుమారు 50 ఎకరాలకు నీరందించే చెరువు నీరు వృథాగా పోవడంతో రైతులు, చెరువులో చేపలు పట్టి జీవించే మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నీటిపారుదల శాఖ ఈఈ విష్ణుప్రసాద్, డీఈ వేణుగోపాల్, ఏఈ తిరుపతి, స్థానిక సీఐ రవీందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే వివేక్ ఆదేశాల మేరకు ఇసుక బస్తాలు వేసి నీరు వృథా పోకుండా చర్యలు చేపడతామని విష్ణుప్రసాద్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ వెల్లడించారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఆ శిక్ష.. ఐపీఎస్‌లపై కక్ష!

తనను అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని మనసులో పెట్టుకున్న బాబు

అధికారులను అక్రమ కేసులతో వేధిస్తున్న ఏపీ ప్రభుత్వం ● ఇందులో భాగంగా హనీ ట్రాప్, ఫోర్జరీ కేసుల్లో నిందితురాలైన జత్వానీకి వత్తాసు

సాక్షి, అమరావతి: వలపు వల (హనీ ట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిల్ చేయడం ఆమె వ్యవహార శైలి.. ఫోర్జరీ పత్రాలతో మోసాలకు పాల్పడటం ఆమె నైజం.. ఏపీ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో కేసులు ఆమె నేర చరిత్రకు సాక్ష్యం.. ఫోర్జరీ నేరంపై విజయవాడ న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్.. ఇదీ ఇటీవల నేపథ్యం.. తీవ్రమైన నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీ నిరాధార ఆరోపణలతో ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఫిర్యాదు చేస్తే, ప్రభుత్వం ఎలా స్పందించాలి? ఆమెను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ద్వారా రిమాండ్ విధించిన అధికారులపై కక్ష పూరితంగా ఆరోపణలు చేస్తున్నట్టుగా భావించాలి. మరోవైపు ఆమె ఆరోపణలు ఎంత వరకు వాస్తవమో దర్యాప్తునకు ఆదేశించాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. జుగుప్సాకరమైన, తీవ్రమైన ఆర్థిక నేరాల్లో నిందితురాలైన కాదంబరి జత్వానీకి చంద్రబాబు ప్రభుత్వం విశిష్ట అతిథి స్థాయిలో ప్రోటోకాల్ మర్యాదలు చేస్తోంది. ఆమె ఫిర్యాదును సాకుగా చేసుకుని డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు, ఐజీ టి.కాంతి రాణా, డీఐజీ విశాల్ గున్నీలను ఏకపక్షంగా సస్పెండ్ చేసింది. ఎన్నికలకు ముందు తనను అరెస్ట్ చేయడాన్ని మనసులో పెట్టుకున్న చంద్రబాబు.. అధికారంలోకి రాగానే సీనియర్ ఐపీఎస్ అధికారులపై.. అదీ ఏకంగా డీజీ స్థాయి, ఐజీ, డీఐజీ స్థాయి అధికారులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని అర్థమవుతోంది. వ్యక్తిగత కక్షతోనే ఈ ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం మేరకు కుట్ర పూరితంగా కక్ష సాధింపునకు పాల్పడుతోంది.

కాదంబరితో క్విడ్ ప్రో కో కుట్ర

వలపు వల (హనీట్రాప్)తో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడటమే వ్యాపకంగా మార్చుకున్న కాదంబరి జత్వానీతో కూడా చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కో కుట్రకు తెరతీసింది. ఫోర్జరీ పత్రాలతో భూములు కొల్లగొట్టేందుకు యత్నించి అడ్డంగా దొరికిపోయిన ఆమెతో టీడీపీ ప్రభుత్వం అవగాహనకు రావడం విడ్డూరంగా ఉంది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన కేసుల్లో నిందితురాలికి వత్తాసు పలుకుతూ ఐపీఎస్ అధికారులను వేధిస్తుండటం పట్ల అఖిల భారత సర్వీసు అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నేర చరిత్ర ఉన్న కాదంబరి జత్వానీతో తప్పుడు ఫిర్యాదు ఇప్పించి.. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, టి.కాంతిరాణా, విశాల్ గున్నీలను ఇప్పటికే ఏకపక్షంగా సస్పెండ్ చేసిన ప్రభుత్వం.. వారిపై మరిన్ని వేధింపులకు పాల్పడేందుకు సన్నద్ధమవుతుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాదంబరి జత్వానీ విజయవాడలో ప్రత్యక్షం కావడం వెనుక పక్కా కుట్ర దాగి ఉందని అధికార వర్గాలే వెల్లడిస్తున్నాయి. గతంలో ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసును నీరుగారుస్తామని చెబుతూ.. అందుకు ప్రతిగా ఆ ముగ్గురు ఐపీఎస్ అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయమని ఆమెకు షరతు విధించినట్టు స్పష్టమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వ కథ, స్క్రీన్ ప్లే ప్రకారం కాదంబరి జత్వానీ నెల రోజులుగా విజయవాడలో హైడ్రామా సృష్టిస్తున్నారు.



జత్వానీపై ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో పలు కేసులు ఉన్నాయి. వలపు వలతో బడా బాబులను బ్లాక్ మెయిలింగ్ చేయడం ఆమె వ్యాపకంగా చేసుకున్నారని పలు ఫిర్యాదులు, విమర్శలు ఉన్నాయి.

నిందితురాలితో ప్రభుత్వం కుమ్మక్కు

పారిశ్రామికవేత్త కుక్కల విద్యాసాగర్‌కు చెందిన ఐదు ఎకరాలను ఫోర్జరీ పత్రాలతో మరొకరికి విక్రయించేందుకు కూడా కాదంబరి జత్వానీ బరి తెగించారు. వెంటనే అప్రమత్తమైన విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఫిర్యాదు చేయడంతో విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. న్యాయస్థానం అనుమతితో నిబంధనలను పాటిస్తూ ముంబయిలో ఆమెను అరెస్ట్ చేసి విజయవాడ తీసుకువచ్చారు. ఫోర్జరీ అభియోగాలకు సంబంధించి పోలీసులు సమర్పించిన ఆధారాలతో న్యాయస్థానం సంతృప్తి చెంది ఆమెకు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన జత్వానీ గతంలో పాల్పడిన తీవ్రమైన, జుగుప్సాకరమైన నేరాలు ఒక్క దెబ్బతో మాయమైపోయినట్టు కాదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం తన ఫోర్జరీ బాగోతాన్ని ఆధారాలతోసహా వెలికి తీసినందుకే ముగ్గురు ఐపీఎస్ అధికారులపై ఆమె కక్ష గట్టారు. కాగా ఆ పోలీసు అధికారులను అక్రమ కేసులతో వేధించాలని నిర్ణయించిన చంద్రబాబు ప్రభుత్వం కాదంబరి జత్వానీని తమ కుట్రలో భాగస్వామిగా చేసుకుంది. ప్రభుత్వ పెద్దలు ఆమెతో ఇటీవల ఇప్పించిన ఫిర్యాదుతో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఇంకొందరు పోలీసు అధికారుల పేర్లను కూడా చేర్చేందుకు సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది.

మరో టార్గెట్ రామకృష్ణే..

చంద్రబాబు, ఈనాడు రామోజీరావు కుటుంబం క్విడ్ ప్రో కోకుట్ర మరోసారి అధికారికంగా బట్టబయలవుతోంది. అందులో భాగంగానే స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ పూర్వపు ఐజీ రామకృష్ణకు టీడీపీ కూటమి ప్రభుత్వం గురి పెట్టింది. ఎందుకంటే.. రామోజీరావు కుటుంబం దశాబ్దాలుగా మార్గదర్శి చిట్ ఫండ్స్ ద్వారా యథేచ్ఛగా పాల్పడిన ఆర్థిక అక్రమాలను ఆధారాలతో సహా ఆయన నిగ్గు తేల్చారు. కేంద్ర చిట్ ఫండ్ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు రామకృష్ణ ప్రయత్నించారు. ఆ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు కుటుంబం మార్గదర్శి చిట్స్ చందాదారుల సొమ్మును అక్రమ మార్గాల ద్వారా మళ్లించి తమ కుటుంబ వ్యాపార సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్‌లో అక్రమ పెట్టుబడులుగా పెట్టినట్టు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ గుర్తించింది. ఘోస్ట్ చందాదారుల పేరుతో అక్రమాలు, రశీదుల ముసుగులో అక్రమ డిపాజిట్ల సేకరణ తదితర ఆర్థిక నేరాలను వెలుగులోకి తెచ్చింది. దాంతో రెండేళ్లపాటు మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో కొత్త చిట్టీ గ్రూపులు నిలిచి పోవడంతో రామోజీ కుటుంబ ఆర్థిక అక్రమాల పునాదులు కదిలాయి. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ ఫిర్యాదుతో సీఐడీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్రమాలకు పక్కా ఆధారాలు లభించడంతో గత ఏడాది రామోజీరావు (ప్రస్తుతం చనిపోయారు), ఆయన కోడలు శైలజ కిరణ్‌ను హైదరాబాద్‌లో విచారించారు. ఇది ఆ కుటుంబంతో అనుబంధం ఉన్న చంద్రబాబుకు ఏమాత్రం రుచించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రామకృష్ణను వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారు. ఆయనకు పోస్టింగు ఇవ్వనే లేదు. మరోవైపు ఐఆర్ఎస్ అధికారిగా ఆయన డెప్యూటేషన్ పూర్తి కావడంతో కేంద్ర సర్వీసులకు తిరిగి వెళ్లాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేయకపోయినా సరే.. డీమ్డ్ టు బీ రిలీవ్డ్‌గా పరిగణించి ఆయనకు కేంద్ర ప్రభుత్వం పోస్టింగు ఇచ్చేందుకు సిద్ధమైంది. నిబంధనల మేరకు సాగుతున్న పరిణామాలపై రామోజీరావు కుటుంబం భగ్గుమంది. రామకృష్ణను లక్ష్యంగా చేసుకుని ఈనాడు పత్రికలో రెండు రోజులుగా ప్రత్యేక కథనాలు ప్రచురించారు. రాజగురువు కుటుంబానికి ఆగ్రహం కలిగిందని బెంబేలెత్తిన చంద్రబాబు ప్రభుత్వం.. నిబంధనలను అతిక్రమించేందుకు కూడా వెనుకాడటం లేదు. రామోజీ కుటుంబాన్ని సంతృప్తి పరిచేందుకు రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాన్ని ఆదేశించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వ అధికారి అయిన ఆయనపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ వర్గాలు తర్జన భర్జన పడుతున్నాయి. కానీ రామోజీ కుటుంబం కళ్లల్లో ఆనందం చూడటమే తమ లక్ష్యం.. అన్నట్లు రామకృష్ణపై చర్యలు తీసుకోవాల్సిందేనని ముఖ్యమంత్రి కార్యాలయం స్పష్టం చేసినట్టు సమాచారం. దాంతో రామకృష్ణపై ప్రభుత్వం ఒకట్రెండ్రోజుల్లో కక్ష సాధింపు చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.

జిల్లా వార్తలు

ఐటీడీఏ ఏఓగా రాంబాబు బాధ్యతల స్వీకరణ



రాంబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీఓ, ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిపాలన అధికారి (ఏఓ)గా సున్నం రాంబాబు మంగళవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భద్రాచలం ఐటీడీఏలో విధులు నిర్వర్తించి బదిలీపై ఊట్నూరు వెళ్లానని, తిరిగి భద్రాచలం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన రాంబాబుకు ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.


ఎన్‌సీసీ క్యాంప్‌లో పతకాల పంట



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కొణిజర్ల: వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన ఎన్‌సీసీ కేడెట్–7 క్యాంపులో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో ప్రథమ, గ్రూప్ డాన్స్‌లో ద్వితీయ, ఖోఖోలో ద్వితీయ స్థానం, త్రోబాల్‌లో ద్వితీయ స్థానం సాధించారు. అలాగే, సోలో డాన్స్‌లో కె.శ్రావిక ప్రథమ, పాటల పోటీల్లో ఎల్.నందిని ద్వితీయ, పరుగు పందెంలో ఎం.శిరీష తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. విద్యార్థినులతో పాటు గైడ్ అధ్యాపకులను ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవాణి అభినందించారు.

బొగ్గు రవాణా చర్చలు సఫలం



ఎమ్మెల్యే, జీఎం సమక్షాన చర్చిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షాన కోల్ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. ఇల్లెందులోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో జరిగిన చర్చల్లో చర్చల్లో కేటీసీ నుంచి సీహెచ్‌పీకి బొగ్గు సరఫరా విషయమై చర్చించారు. ఈమేరకు బుధవారం నుంచి ప్రతీరోజు నాలుగు వేల టన్నులు బొగ్గు రవాణా చేసేందుకు అంగీకారం కుదిరింది. ఈ సమావేశంలో సింగరేణి అధికారులు బొల్లం వెంకటేశ్వర్లు, మధుబాబు, దీలీప్‌కుమార్, శివకుమార్, అంజిరెడ్డి, కోల్ ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు భరోసా

- కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి
- ఉచితంగా ప్రమాద బీమా
- ఈఎస్ఐ వైద్యసేవల ఏర్పాటుకు సన్నాహాలు
- సంస్థ వ్యాప్తంగా 31,900 మందికి ప్రయోజనం



కొత్తగూడెంలో సీఎండీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపుతో పాటు ఇతర అన్ని పనుల్లో కీలక పాత్ర పోషిస్తూ, సంస్థ అభివృద్ధి పర్మినెంట్ కార్మికులకు దీటుగా పనిచేస్తున్న వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం దృష్టి సారించింది. గతంలో సింగరేణి ఆస్పత్రుల్లో కేవలం కార్మికుడికి సేవలందిస్తుండగా, ఇప్పుడు ఈఎస్ఐ ద్వారా కార్మికులు, వారి కుటుంబాలకు సైతం వైద్యసేవలందించనున్నారు. అంతేకాక ఉచిత ప్రమాద బీమా అమలుకు బ్యాంకులతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఇక ఖాళీగా ఉన్న క్వార్టర్లను మరమ్మతు చేసి కేటాయించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది.

46 విభాగాల్లో విధులు

సంస్థలోని భూగర్భ గనులు, ఓపెన్‌కాస్ట్ గనులతో పాటు ఇతర కార్యాలయాల్లోని 46 విభాగాల్లో 31,900మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్‌లో 6,500 మంది, మణుగూరులో 2,200 మంది, ఇల్లెందులో 400 మంది, సత్తుపల్లిలో 800మంది, రామగుండం, బెల్లంపల్లి రీజియన్లలో 11వేల మంది చొప్పున కార్మికులు ఉన్నారు. వీరందరికీ బ్యాంకు ఖాతా ఆధారంగా ఉచిత ప్రమాద బీమా అమలుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో యాజమాన్యం ఒప్పందం చేసుకుంది.

బీమా ఇలా...

ప్రమాదంలో ఒప్పంద కార్మికుడు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.20 లక్షల బీమా సొమ్ము అందిస్తారు. అలాగే, డెబిట్‌కార్డ్ వాడకం ఆధారంగా రూ.10 లక్షల అదనపు బీమా వర్తిస్తుంది. శాశ్వత, పూర్తి ప్రమాద వైకల్యం సంభవిస్తే రూ.20 లక్షల బీమా సదుపాయం ఉంటుంది. ఉద్యోగి ప్రమాదంలో మృతిచెందితే వారి పిల్లల చదువుకు రూ.4 లక్షల ఆర్థిక సాయం అందుతుంది. అనారోగ్య కారణంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకుంటే రోజుకు రూ.వెయ్యి చొప్పున 15 రోజుల పాటు ఆర్థిక సాయం లేదా ఏడాదిలో గరిష్టంగా రూ.15 వేల సాయం అందిస్తారు.

వేతనాలు కూడా పెంచాలి...

కాంట్రాక్టు కార్మికులకు వివిధ పథకాలు అమలుచేస్తున్న యజమాన్యం వేతనాలు కూడా పెంచాలని కోరుతున్నారు. 2017లో కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.522, సెమీ స్కిల్డ్ వారికి రూ.610, స్కిల్డ్ కార్మికులకు రూ.734, హై స్కిల్డ్ వారికి రూ.862 చొప్పున మస్టర్ వారీ వేతనం అందుతోంది. అయితే, కోలిండియా ఆదేశాల మేరకు ప్రతీ ఐదేళ్లకోసారి 30 శాతం వేతనాలు పెరగాల్సి ఉంది. కానీ గత ఏడేళ్లుగా పెంచనందున ఇకనైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

అప్పుడే న్యాయం జరుగుతుంది..



సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను 2017 తర్వాత పెంచలేదు. ప్రతీ ఐదేళ్లకోసారి పెంచాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదు. ఇతర పథకాలు అమలు చేస్తున్నట్లుగానే శ్రమదోపిడీ జరగకుండా వేతనాలు కూడా పెంచితేనే కార్మికులను న్యాయం జరుగుతుంది.

– షేక్ యాకూబ్ షావలీ, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

కార్మికులపై సీఎండీ శ్రద్ధ



కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమంపై సింగరేణి సీఎండీ దృష్టి సారించడం అభినందనీయం. ప్రమాద బీమాతోపాటు, ఈఎస్ఐ ఆస్పత్రిలో సేవలు అందించాలని నిర్ణయించారు. త్వరలోనే కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్లను కేటాయించాలని అలోచన చేస్తుండడం ఆనందంగా ఉంది.

– ఈ.నాగేశ్వరరావు, బీఎంఎస్ కాంట్రాక్ట్ విభాగం ప్రధాన కార్యదర్శి

చెత్త వేస్తే సహించేది లేదు..

మున్సిపల్ వాహనాలను అడ్డుకున్న స్థానికులు

వైరారూరల్: వైరా మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన కింద మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్త వేస్తే అడ్డుకుంటామని స్టేజీ పినపాక, గండగలపాడు గ్రామ రైతులు, స్థానికులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చెత్తతో వచ్చిన వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న హైలెవల్ వంతెన కింద చెత్త డంప్ చేయడంతో వరద వచ్చిన సమయాన చెత్త తమ పొలాల్లో మేట వేస్తోందని చెప్పారు. అంతేకాకుండా దుర్వాసనతో ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. ఇదిపోగా నిప్పంటుకుని వెలువడే పొగతో వాహనదారులు అవస్థ పడుతున్నారని వాపోయారు. ఇకనైనా చెత్తను హైలెవల్ వంతెన కింద కాకుండా ప్రభుత్వం రిజర్వాయర్ సమీపాన కేటాయించిన స్థలంలో చెత్తను డంప్ చేయాలని డిమాండ్ చేశారు.



వాహనాలు అడ్డుకుని నినాదాలు చేస్తున్న స్థానికులు

సింగరేణి క్యాంటీన్‌లో మధ్యాహ్న భోజనం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ క్యాంటీన్‌లో మంగళవారం నుంచి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించారు. కరోనాకు ముందు ఉద్యోగులు, కార్మికుల కోసం క్యాంటీన్‌లో తక్కువ ఖర్చుతో టిఫిన్, భోజన సౌకర్యం ఉండగా, ఆతర్వాత నిలిచిపోయింది. ఇటీవల వినతులు రావడంతో ఈ సౌకర్యాలు పునరుద్ధరించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సౌకర్యార్థం భోజనం సమకూర్చేందుకు సంస్థ నిర్ణయించిందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ కార్పొరేట్ ఉపాధ్యక్షుడు పీతాంబరం, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రమణమూర్తి, కమ్యూనికేషన్ సెల్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల వెంట 3వేల మొక్కలు

నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య

నేలకొండపల్లి: జాతీయ రహదారుల వెంట మంగళవారం ఒకేరోజు మూడు వేల మొక్కలు నాటామని నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.దివ్య వెల్లడించారు. జాతీయ స్థాయి ప్లాంటేషన్ డ్రైవ్ సందర్భంగా నేలకొండపల్లి మండలం పైనంపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం ఆమె మొక్కలు నాటారు. అనంతరం టోల్‌గేట్ వద్ద పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ కోదాడ–ఖమ్మం, దేవరపల్లి–ఖమ్మం జాతీయ రహదారి పరిధిలో మూడు వేల మొక్కలు నాటామని తెలిపారు. కాగా, కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి పనులు ఇంకా 1.3 కి.మీ. మేర చేపట్టాల్సి ఉందని, ఈ పనులు పూర్తిచేసి త్వరలోనే రహదారిని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ పి.రామిరెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



పైనంపల్లి టోల్‌గేట్ పనులను పరిశీలిస్తున్న పీడీ దివ్య, అధికారులు

సీఎం సహాయ నిధికి రూ.10.11లక్షలు

ఖమ్మంగాంధీచౌక్: మున్నేటి వరదతో నష్టపోయిన వారిని ఆదుకునేలా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున రూ.10,11,000 విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా చెక్కును మంగళవారం ఖమ్మంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, కైలాసపు వేణుగోపాల్, పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు, విడాల శ్రీనివాసరావు, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్, వేములపల్లి వెంకటేశ్వరరావు, తేరాల ప్రవీణ్ పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలకు చెక్కు అందిస్తున్న చాంబర్ ప్రతినిధులు

సింగరేణి స్థాయి పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జీఎం సామ్యేల్ సుధాకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి స్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు మంగళవారం కొత్తగూడెంలో సీఈఆర్ క్లబ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి ఆరు జట్లు హాజరు కాగా 250 మంది క్రీడాకారులు ఉన్నారు. వీరిలో 50 మంది మహిళా ఉద్యోగినులు ఉండడం విశేషం. కాగా, పోటీలను జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) సామ్యేల్ సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు సత్తా చాటి కోలిండియా స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా పోటీ తత్వం పెరగడమే కాక స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. జీఎం సెక్యూరిటీ కె.శ్రీనివాసరావు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఎస్‌వీ.రమణమూర్తి, పీతాంబరం, ఎం.విజయ్‌భాస్కర్‌రెడ్డి, టి.శ్రీనివాసరావు, పాసినెట్, ఏ.వీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.